క్లుప్తంగా

మేకపాటి గెలుపు కోసం ప్రార్థనలు



ఏఎస్‌పేట దర్గా వద్ద ముస్లిం నేతలు

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శనివారం ఉదయగిరి ముస్లిం నాయకులు ఏఎస్‌పేట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, ఉదయగిరిలో మరింత అభివృద్ధి జరగాలని, ఉదయగిరి ఎమ్మెల్యేగా రాజగోపాల్‌రెడ్డి అసెంబ్లీలో అడుగుపెట్టాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించినట్లు ముస్లిం నేతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు ఎంఏ రియాజ్, ఎంఏ సలీం, ఎంఏ అంజీర్, ఫారుక్, ఉప్పుటూరు హరి తదితరులు పాల్గొన్నారు.

64.95 శాతం పింఛన్ల పంపిణీ



కరటంపాడులో జి.సురేంద్రకు పింఛన్ అందజేస్తున్న సంక్షేమ సహాయకుడు బాలకృష్ణ

ఆత్మకూరురూరల్: మండలంలో శనివారం సామాజిక పింఛన్లు సచివాలయ అధికారుల ద్వారా 64.95 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సచివాలయాల వారీగా బట్టేపాడులో 84.54 శాతం మందికి, మురగళ్లలో 79.39 శాతం, వాశిలిలో 76.92 శాతం మందికి పింఛన్ నగదు పంపిణీ చేశారు.

దాహార్తి తీరుస్తున్న చలివేంద్రం



ఆత్మకూరు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆత్మకూరు పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో గత నాలుగు రోజులుగా నిర్వాహకులు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లని తాగునీరు, మజ్జిగ అందజేస్తూ ప్రజల దాహాన్ని తీరుస్తున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈఓ జానకీరాం

సోమశిల: అనంతసాగరం మండల ఎంఈఓగా జానకీరాం శనివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సంగం మండలంలో విధులు నిర్వహిస్తూ అనంతసాగరానికి ఎఫ్ఏసీ ఎంఈఓగా వచ్చారు. ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహించిన బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంఈఓ జానకీరాం మాట్లాడుతూ ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాబోధన చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఆత్మకూరు: విక్రమ సింహపురి యూనివర్సిటీ బీసీఏ, బీబీఏ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఆత్మకూరు పట్టణానికి చెందిన ఏఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బీసీఏ డాటా సైన్స్ విభాగంలో ఎం.శృతి అనే విద్యార్థిని 9.10 ఎస్‌జీపీఏ సాధించి డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కళాశాల విద్యార్థులు వరసగా 9 స్థానాలు కైవశం చేసుకోవడంతోపాటు నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు. అదే విధంగా బీకాం కంప్యూటర్స్ విభాగంలో కె.పావని 9.0 ఎస్‌జీపీఏ సాధించి డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని, కళాశాల విద్యార్థులు వరుసగా బీకాం కంప్యూటర్స్‌లో 13 ర్యాంకులు సాధించారని తెలిపారు. బీసీఏ విభాగంలో ఎం.అక్షయ 9.40, బీబీఏ విభాగంలో బి.ఈశ్వరమ్మ 8.05 శాతం సాధించి డివిజన్‌లో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ ఏడాది నుంచి తమ కళాశాలలో కోర్సు పూర్తి కాగానే జాబ్ గ్యారెంటీగా ఉండే 'ఫుడ్ సైన్స్ టెక్నాలజీ' కోర్సును ప్రారంభించినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జన్మోత్సవం

- ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు
- సామూహిక ఆకు పూజలు, చాలీసా పారాయణం
- హనుమాన్ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ఆత్మకూరు: బైపాస్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: శ్రీరామభక్త హనుమంతుని జన్మోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆత్మకూరు పట్టణంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవస్థానాలు, విగ్రహాల వద్ద భక్తులు హనుమంతునికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. పంటవీధిలోని కోదండ రామాలయంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరించి, విశేష పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. మహిళలు సామూహికంగా లక్ష తమలపాకులతో సహస్ర నామ పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి హంస వాహనంపై ఆంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి సింధూరం, తమలపాకులతో పూజలు నిర్వహించారు. హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు ఆత్మకూరు పట్టణం నుంచి బైపాస్ రోడ్డులోని ఆలయం వరకు జైశ్రీరామ్.. జైహనుమాన్ నినాదాలు చేస్తూ శోభాయాత్ర చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 60 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పండరి భజన, అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే సుందరమ్మ కోదండ రామాలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో..

జలదంకి: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, హోమం, సహస్ర నామార్చన, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జలదంకిలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. జలదంకి వీరాంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజలకు రామాల చెంచురెడ్డి, దండా అనిల్‌కుమార్‌రెడ్డి, పానుగోటి శివకుమార్‌రెడ్డి, ఇస్కా కృష్ణారెడ్డి, కోర్శిపాటి లక్ష్మీ నారపరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చుంచులూరులో..

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామస్తులు ఆంజనేయస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుంచులూరు, పరిసర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు జొన్నా సత్యనారాయణ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా, అన్న ప్రసాద వితరణకు దువ్వూరు జయదేవ్ కుటుంబసభ్యులు దాతలుగా వ్యవహరించారు.

సంగం: మండలంలోని జంగాలదొరువు, సంగంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా..

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల్లో అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు, ఆకు పూజ నిర్వహించారు. విరువూరు, రామాపురం, వరికుంటపాడు, తూర్పుబోయమడుగుల గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో..

కలిగిరి: మండలంలో శనివారం హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కలిగిరిలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆంజనేయస్వామి ఆలయం, ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంజనేయస్వామి విగ్రహం, జిర్రావారిపాళెంలోని అభయాంజనేయస్వామి విగ్రహం, కమ్మవారిపాళెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జన్మోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తులకు అన్నదానం

అల్లూరు: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బోర్లో సంఘం కలుజుల వద్ద గల హనుమాన్ ఆలయంలో విశేష పూజలు చేశారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

చేజర్ల: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద శనివారం హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగిపోయాయి. చేజర్ల, యనమదల, మడపల్లి, కాకివాయి, ఆదూరుపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు ఆంజనేయస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భక్తులు స్వామివారి భజనలు చేశారు.

ఘనంగా..

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో ఉన్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం హనుమాన్ జన్మోత్సవం వేడుకగా నిర్వహించారు. అర్చకులు స్వామివారికి వేకువజామునే అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ పూజలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే దుత్తలూరులో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే నందిపాడు, రాచవారిపల్లి, బ్రహ్మేశ్వరం, నర్రవాడ తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వాడవాడలా వేడుకలు

ఆత్మకూరురూరల్: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని రామస్వామిపల్లి, గండ్లవేడు, దేపూరు, వాశిలి, బట్టేపాడు, మురగళ్ల, నల్లపరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

అనంతసాగరం మండల పరిధిలో..

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని ఉప్పలపాడు, సోమశిల, అనంతసాగరం, వెంగంపల్లి, రేవూరు, శంకరనగరం గ్రామాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉదయగిరి మండలంలో..

ఉదయగిరి: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి పట్టణంలోని ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు. కుర్రపల్లి గడ్డ,గండిపాలెం తదితర ప్రాంతాల్లో వేడుకలు జరిగాయి. పలుచోట్ల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా జన్మోత్సవం

సీతారామపురం: మండలంలోని సీతారామపురం, దేవిశెట్టిపల్లి, ఒగూరువాండ్లపల్లి తదితర గ్రామాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

హనుమాన్ సేవా సమితి విశేష పూజలు



పొంగూరులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మర్రిపాడు: హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని మర్రిపాడు మండలంలోని పొంగూరు గ్రామంలో శనివారం వేడుకలు నిర్వహించారు. హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో యడవల్లి మురళీకృష్ణ నేతృత్వంలో ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో అర్చకులు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి సింధూరం, తమలపాకులతో ఆకుపూజ నిర్వహించారు. పొంగూరు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు జైశ్రీరామ్, జైహనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పండరి భజన ప్రదర్శన వేడుకగా నిర్వహించారు.



అల్లూరు: అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు



దుత్తలూరు: వెంకటంపేటలో విశేషాలంకరణలో వీరాంజనేయస్వామి



ఆత్మకూరురూరల్: రామస్వామిపల్లిలో..



మర్రిపాడు: చుంచులూరులో..



జలదంకి: సీతారామాంజనేయస్వామి ఆలయంలో..



ఆత్మకూరు: పంటవీధి కోదండ రామాలయంలో ఆకుపూజ చేస్తున్న మహిళలు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ఉదయగిరి: ఈ నెల 4న కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వి.గిరిబాబు హెచ్చరించారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్‌లో ఉన్న పోలీస్ పికెట్‌ను ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నాయని తెలిపారు. మండలంలోని జి.చెరువుపల్లి, గంగిరెడ్డిపల్లి, బండగానిపల్లితోపాటు వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యాలయాల వద్ద, ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయగిరి పట్టణంలోని పలు కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా రాజకీయ పార్టీలు, ప్రజలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఉదయగిరి: బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

సోమశిల: అనంతసాగరం మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ సూచించారు. అనంతసాగరం మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ తాజ్ మస్రూర్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో ప్రతి నీటి చుక్క విలువైందని, అవసరమైనంత వరకే వాడాలని, ఎండాకాలంలో నీటిని వృథా చేయకూడదని తెలిపారు.

వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పండిన పంటలు కన్నా ఈ ఏడాది అధిక దిగుబడితోపాటు గిట్టుబాటు ధరలు ఉండడం చాలా సంతోషమని, రైతులకు మద్దతు ధరలు ఉండడంతో ప్రభుత్వ గోడౌన్లలో ధాన్యాన్ని నిల్వ ఉంచలేదని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య 99 శాతం ఎక్కడా లేదని, ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకులు శుభ్రపరచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విద్యాశాఖాధికారి–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల విడుదలైన 10 ఫలితాల్లో 93 శాతం మండలంలో ఉత్తీర్ణత సాధిచారన్నారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, వైస్ ఎంపీపీలు పాణెం శ్రీనివాసులు, అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ శోభ, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ఆత్మకూరు: పర్యావరణాన్ని పరిరక్షించేది చెట్లు మాత్రమేనని, వాటిని పెంచి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో అభ్యుదయ మహిళా మండలి అధ్యక్షురాలు జే జయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు మొక్కలు నాటి వాటిని సంరక్షణకు ప్రజలలో అవగాహన కల్పించడం మంచి పరిణామమన్నారు. గతంలో పోలిస్తే ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్న విషయం గమనించి తప్పనిసరిగా భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, ఏఈలు జే ప్రసాద్, వరలక్ష్మి, మెప్మా సిబ్బంది మాధవి, తేజ, ప్రశాంతి, మున్సిపల్ సిబ్బంది సుభాన్, రఫీ, నాయబ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



చికిత్స పొందుతున్న తిరుపతమ్మ

చేజర్ల: తనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తిరుపతమ్మ కోరారు. చేజర్ల మండలం వావిలేరు గ్రామంలో పొలం విషయంలో తిరుపతమ్మపై ఆ గ్రామానికి చెందిన పలువురు దాడి చేశారని స్థానికులు తెలిపారు. తిరుపతమ్మ చికిత్సనిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఈ ఘటనపై శనివారం తిరుపతమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సీతారామపురం : వేసవి తీవ్రత దష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి సూచించారు. ఆమె శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అత్యవసర ప్రాతిపదికన తాగునీటి సమస్యపై చర్చించారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రజాప్రతినిధుల సమన్వయంతో అధికార యంత్రాంగం మండలంలో అభివృద్ధి పనులపై దష్టి సారించాలన్నారు. గ్రామాల్లో క్లీన్ అండ్ గ్రీన్, ప్రతి కుటుంబానికి వంద రోజుల ఉపాధి హామీ పనులు, ప్రజలకు మెరుగైన సచివాలయ, వైద్య సేవలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. అనంతరం విద్య, వైద్యం, ఉపాధి, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

లబ్ధిదారులకు పింఛన్ల అందజేత

అల్లూరు: అల్లూరు మండలంలో మొత్తం 7,406 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. 2,236 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జ్యోతి శనివారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది 80.32 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు.